చరిత్రలో జరగని అభివృద్ధి చేశా

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
● పోచారం, కామారెడ్డిపల్లెలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పరకాల: పరకాల నియోజకవర్గాన్ని గత పాలకులు చేపట్టని విధంగా అన్ని రంగాల్లో చరిత్రలో జరగని అభివృద్ధి చేశానని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పోచారం గ్రామంలో రూ.4.40 కోట్లతో నూతనంగా నిర్మాణం చేసిన హై లెవల్ వంతెన, రూ.13లక్షలతో నిర్మించిన మహిళా భవనం, రూ.50లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ కాల్వలను ప్రారంభించారు. అలాగే కామారెడ్డిపల్లెలో రూ.15 లక్షలతో సీసీ డ్రెయినేజీల పనులకు శంకుస్థాపన, రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన మహిళా భవనం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుర్ర రాజమౌళి, బెల్లి పద్మ, ఎంపీటీసీ రమేష్, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పోచారంలో మహిళా భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పశువైద్యాధికారిని నిలదీసిన గొల్ల కురుమలు

● పశువైద్యశాల ఎదుట బైఠాయింపు

శాయంపేట : రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారుల ఎంపికకు సమాచారం ఇవ్వకుండా మండల పశువైద్యాధికారి డాక్టర్ సునీల్ తనకు నచ్చిన వారిని ఎంపిక చేశారని గొల్లకురుమ సంఘం సభ్యులు సోమవారం నిలదీశారు. అనంతరం పశువైద్యశాల ఎదుట గొల్ల కురుమలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు సవ్వాసి బీరయ్య, అమ్మ సురేష్, నందం రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండంలోని పెద్దకోడెపాకకు చెందిన గొల్ల కురుమలు రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 59 మంది గొల్ల కురుమలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో సంఘం అధ్యక్షుడు మృతి చెందగా ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిబంధనల ప్రకారం డ్రా తీయకుండా డాక్టర్ సునీల్ తనకు ఇష్టం వచ్చిన 12 మంది లబ్ధిదారులతో డీడీ తీయించి 12 యూనిట్లు పంపిణీకి తరలించారని తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడికి, డైరెక్టర్లకు, సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో డాక్టర్ సునీల్ ఇష్టానుసారంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ విషయంపై డాక్టర్ సునీల్‌పై, జేడీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి, జంపాల్, రమేష్, రాజయ్య, ధర్మయ్య, రాజు పాల్గొన్నారు.



పశువైద్యాధికారి సునీల్‌ను నిలదీస్తున్న గొల్లకురుమలు

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ



కమలాపూర్ : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా హసన్‌పర్తి ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పల్లవి బదిలీ కాగా ఆమె స్థానంలో రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మండలంలోని శనిగరంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



శ్రావణ్‌కుమార్, అధ్యక్షుడు

ఎల్కతుర్తి: మండలంలోని కోతులనడుమ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా బోయినపల్లి బాపురావు, ఉపాధ్యక్షుడినిగా ఎర్రోళ్ల చైతన్య, గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎర్రోళ్ల శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తడుగుల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాట్ల రాజయ్య, సహాయ కార్యదర్శిగా ఎర్రోళ్ల రాజేష్, సలహాదారునిగా గండికోట రాజు ఎన్నికయ్యారు.

పరామర్శ



కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంలో ఇటీవల మృతి చెందిన బీజేపీ హనుమకొండ జిల్లా దళిత మోర్చా కార్యదర్శి పాక మురళి కుటుంబాన్ని హసన్‌పర్తి 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సోమవారం పరామర్శించారు. అనంతరం మురళి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు మహాజన్ భిక్షపతి, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చేయూత



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం మల్లారం ఉన్నత పాఠశాలలో 2001–02 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు, తోటి స్నేహితుడు దండెం శ్రీనివాస్ ఈనెల 4న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మృతుని కుటుంబానికి భరోసా కల్పించేందుకు మిత్రులంతా కలిసి రూ.50వేలు కూతురి పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను స్నేహితుని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యాసరచన పోటీలో లావణ్యకు ప్రథమ బహుమతి



ఆత్మకూరు: ఇటీవల బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కొయ్యడ లావణ్య జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించగా బీసీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంకరయ్య బహుమతి అందచేశారు. ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి లావణ్యను అభినందించారు.

మంత్రి దయాకర్‌రావును కలిసిన టీఎన్జీఓస్ నాయకులు

హన్మకొండ అర్బన్: ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆయన స్వగృహంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి శుభాకాంక్షల తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

40 శాతం మందికే రుణమాఫీ

ఐనవోలు: తెలంగాణ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి కేవలం 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొండపర్తిలో యూనియన్ బ్యాంక్ ఎదుట రైతులతో కలిసి కోటేశ్వర్‌రావు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన తరుణంలో మిగిలిపోయిన రైతులకు రుణమాఫీ కాదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం 100 శాతం రుణమాఫీ పూర్తయిందని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ కాని రైతులందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ధర్నాలో కుసుంబ కోటేశ్వర్‌రావు, వరికెల రఘుపతి, గిరుక సంపత్, గిరుక వెంకన్న, ఆకారపు బుచ్చిమల్లు, ఆకారపు చెన్నమల్లు, ఎండిగ రవీందర్, కుసుంబ రాజు, గుండెకారి గౌతం, ఆకారపు మల్లేశం, కుసుంబ మల్లారావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే చిన్నచూపు

శాయంపేట : శాయంపేట మండల అభివృద్ధిపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిన్న చూపు చూస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పత్తిపాకలో 6 గ్యారంటీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుల పంపిణీ సందర్భంగా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై అపూర్వ స్పందన వస్తుందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నియోజకవర్గంలో గండ్ర సత్యనారాయణరావు స్వల్పమెజారిటీతో ఓడిపోయినప్పటికీ కుంగిపోకుండా ధైర్యంతో రైతు పేద ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు చిన్నం రవి, ఎండీ వలీహైదర్, జంగారెడ్డి, రాజకుమార్, వెంకటరాజురెడ్డి, నరేష్‌రెడ్డి, పల్లెబోయిన భాస్కర్, ప్రభాకర్‌రెడ్డి, నవీన్‌కుమార్, కుమారస్వామి, రియాజ్ పాల్గొన్నారు.



గ్యారంటీ కార్డులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

శాయంపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఏబీఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు తూర్పాటి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థుల సమస్యలు అధికమయ్యాయని అన్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నజీర్, పల్లబోయిన అభివర్ధన్ లక్ష్మణ్, రాజేష్, తిలక్, ఆస్మా, సజల, ప్రవళిక, యాత్రిన్, కీర్తన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కాన్షీరాం ఆశయసాధనకు కృషి చేయాలి

శాయంపేట : బీసీ, ఎస్సీ, ఎస్టీలు కాన్షీరాం ఆశయ సాధన కోసం కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంగర విజయప్రకాశ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని సోమవారం మండలంలోని పత్తిపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓట్లు మావే సీట్లు మావే అని బహుజన సమాజ్ పార్టీని స్థాపించిన అసలైన బహుజన నాయకుడు కాన్షీరాం ఒక్కరే అని అన్నారు. దళిత మహిళా ముఖ్యమంత్రిని చేసిన ఘనుడు కాన్షీరాం అని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాలిక శ్రీకాంత్, సాయితిలక్, ప్రమోద్, కల్యాణ్, సుమన్ పాల్గొన్నారు.



కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఎల్కతుర్తి: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన ముగ్గురు వార్డు సభ్యులతో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆయన నివాస గృహం ఆవరణలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. సుమారు 30 మంది పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు శ్రీనివాస్, మహమ్మద్‌పాషా, కర్రె రాజేష్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన ఆయా పార్టీల నాయకులు

‘హరిత’ పితామహుడు స్వామినాథన్

కేయూ క్యాంపస్: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశం ఈ రోజు కడుపు నిండా తినగలుగుతోందంటే దాని వెనుక హరితవిప్లవ పితామహుడు ప్రొఫెసర్ స్వామినాథన్ అసాధారణ కృషి, అనన్య సామాన్య సేవాగుణం ఉందని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌లాల్ అన్నారు. ఈమేరకు స్వామినాథన్ సంతాపసభను కాకతీయ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ 2017లో తమ సంస్థ స్వామినాథన్‌కు ‘భారత్ శాంతిదూత్’ అవార్డును ప్రదానం చేసిందని గుర్తుచేశారు. ప్రముఖ సామాజికవేత్త, సంస్థ సభ్యుడు మండవ పరశురాములు, ఈట సత్యనారాయణ, విద్యాసాగర్, సాంబశివరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సురేష్‌లాల్, తదితరులు

అర్ధరాత్రి అరెస్ట్ చేయడం సిగ్గుచేటు

● మీకు దమ్ముంటే విద్యారంగ సమస్యలు పరిష్కరించండి
● ఏబీఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డిమాండ్

శాయంపేట : ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ భూపాలపల్లి, పరకాల నియోజకవర్గాల పర్యటన సందర్భంగా అర్ధరాత్రి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని, సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు దమ్ముంటే రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద నరేష్ అన్నారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు విద్యార్థి సంఘాల నాయకులను కేటీఆర్ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్ట్ చేసి శాయంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడిచినప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు చేసింది ఏమి లేదన్నారు. నిరుద్యోగులు రాష్ట్రంలో అనేక సమస్యలతో బాధపడుతుంటే ప్రభుత్వం గ్రూప్‌– 1రద్దు చేసి రాష్ట్రంలో ఉన్న లక్షల మంది విద్యార్థుల జీవితాలను నాశనం చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.5వేల కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల గురుకులాలకు, ఎస్ఎంహెచ్ కళాశాలల హాస్టల్స్‌కు సొంత భవనాలు లేవన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మండలంలో ఉన్న ప్రజల, విద్యారంగ సమస్యలను పట్టించుకో లేదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గండ్ర ఓటమి ఖాయమని, కేసీఆర్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు గద్దె దింపుతారని హెచ్చరించారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

దామెర: మంత్రి కేటీఆర్ పరకాల పర్యటనను పురస్కరించుకొని నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉండటంతో మండలంలోని బీజేపీ, కాంగ్రెస్ నాయకులను సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, కన్నె కొమురయ్య, పృథ్వీ తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు జక్కుల ఇందిర, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పోతుల రాజకొమురయ్య, గ్రామ ఉపాధ్యక్షుడు సదిరం లింగయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని అన్నారు.



శాయంపేట : అరెస్టయిన విద్యార్థి సంఘాల నేతలు



దామెర : అరెస్టయిన బీజేపీ నాయకులు

ఎట్టకేలకు కొండెంగ పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని కామారం, గుడెప్పాడ్ గ్రామాల్లో కొండెంగలు సంచరిస్తూ పలువురిని గాయపర్చాయి. ఆదివారం సాక్షి పత్రికలో కొండెంగల హల్‌చల్ శీర్షికతో కథనం ప్రచురితం కాగా గ్రామపంచాయతీ కార్యదర్శి మేడ యాదగిరి స్పందించి జీపీ సిబ్బందితో కొండెంగను పట్టుకున్నారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులు వచ్చి తీసుకెళ్లి అడవిలో వదిలిపెడతారని కార్యదర్శి యాదగిరి తెలిపారు. కొండెంగను పట్టుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజలు సిబ్బందిని అభినందించారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

దామెర : పరకాలలో నిర్వహించిన ప్రగతి నివేదన బహిరంగ సభకు సోమవారం మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. దామెర నుంచి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 400 మంది కార్యకర్తలు వివిధ వాహనాల్లో వెళ్లారు. తరలిన వారిలో జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, జిల్లా నాయకుల దామెరుప్పుల శంకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని రాజు, ప్రధాన కార్యదర్శి వేల్పుల ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఒగ్లాపూర్ నుంచి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి, కోగిల్వాయిలో గట్ల విష్ణువర్ధన్ రెడ్డి, ఊరుగొండలో గోగుల సత్యనారాయణ రెడ్డి, ముస్త్యాలపల్లిలో వడ్డెపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు సభకు తరలారు.

ఆత్మకూరు: పరకాలలో జరిగిన కేటీఆర్ సభకు మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. తరలిన వారిలో ఎంపీపీ మార్క సుమలత, జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

ఉత్తమ పర్యావరణ సేవ అవార్డు

కాజీపేట: పర్యావరణ పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్న ప్రకృతి ప్రేమికుడు కొలిపాక ప్రకాశ్‌కు కరీంనగర్‌కు చెందిన సద్భావన స్వచ్ఛంద సంస్థ ఉత్తమ పర్యావరణ సేవకుడిగా అవార్డును సోమవారం అందించి సత్కరించింది. 2023వ సంవత్సరానికి అవార్డును ప్రకాశ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల నరికివేత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక నుంచి సున్నపురాళ్ల గడ్డ మీదుగా మైలారం వరకు రోడ్డుకిరువైపుల చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్‌లో పెంచిన 37 చెట్లను విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బందితో నరికివేయించారు. ప్లాంటేషన్‌లో చెట్లను నరికివేయద్దని విద్యుత్ లైన్లను మరోచోట నుంచి వేసుకోవాలని సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా 37 చెట్లను నరికివేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ విషయం ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి తెలియజేయగా సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీఓ తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ చెట్లను నరికివేయడంపై ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ కాంట్రాక్టర్ నరికివేయించిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్లు

రాష్ట్రస్థాయి పోటీలకు దామెర విద్యార్థులు

దామెర: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు దామెర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎల్. రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయి పోటీల్లో 12 ఏళ్ల విభాగంలో పాఠశాలకు చెందిన డీ. సంహిత ప్రథమ, ఎస్. తేజస్విని ద్వితీయ, ఎం.వేద్యశ్రీ తృతీయ బహుమలు సాధించి క్లీన్ స్వీప్ చేశారు. అదే విధంగా 14 ఏళ్ల బాలుర విభాగంలో అశ్రిత్‌సాయి ప్రథమ స్థానం, బాలికల విభాగంలో బీ. జశ్వనిక ప్రథమ, సంజన ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను, పీఈటీ బాలిశెట్టి కమలాకర్, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ గోనెల సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్న ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ విమర్శించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 12 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. సమ్మెలో భాగంగా సోమవారం ఖాళీ ప్లేట్లతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై అదనంగా మరో రూ.2 వేలు పెంచుతున్నట్లు 2022లో సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఆ హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి, వేల్పుల సారంగపాణి, మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, ఎస్.రజిత, పాల్గొన్నారు.

చింతగట్టులో జేకే రెస్టారెంట్ ప్రారంభం

హసన్‌పర్తి: నగరంలోని చింతగట్టు క్యాంప్ వద్ద జేకే రెస్టారెంట్‌ను సోమవారం ప్రారంభించినట్లు రెస్టారెంట్ నిర్వాహకుడు బైహింద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో, సర్వహంగులతో రుచికరమైన ఫుడ్స్‌తో ఇండియన్, చైనీస్ తందూరీ, బిర్యానీ వంటి రుచికరమైన వంటకాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సువిశాలమైన ప్రత్యేక ఏసీ క్యాబిన్లు, గెట్ టుగెదర్, విందుల కోసం హాళ్లు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, కవితారెడ్డి, సత్యం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న నిర్వాహకులు